సాక్షి ఖమ్మం

గురువారం । 4 । మే । 2023

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం

గురువారం జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగానే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్షకు 209మందిలో 186మంది హాజరయ్యారు. అలాగే, ఇంటర్మీడియట్ ఉదయం పరీక్షకు 129మందిలో 97మంది, మధ్యాహ్నం పరీక్షకు ఒకరికి ఒకరు హాజరయ్యారు. కాగా, ఇంటర్‌మీడియట్ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయని, వాయిదా పడిన ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్ష 13న నిర్వహిస్తామని డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు.

కరోనా బూస్టర్‌డోస్ తప్పనిసరి



టీకాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వ్యాక్సిన్ మేనేజర్ రమణ

సత్తుపల్లిటౌన్/కల్లూరు/కల్లూరు రూరల్: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరు కరోనా నియంత్రణకు బూస్టర్‌డోస్ వేయించుకోవాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.రమణ సూచించారు. సత్తుపల్లి సీహెచ్‌సీ, కల్లూరు, కల్లూరు మండలం చెన్నూరులోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం ఆయన వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు. అలాగే, కరోనా వ్యాక్సిన్ బూస్టర్‌డోస్ ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆ తర్వాత గంగారం పీహెచ్‌సీలో వ్యాక్సిన్ ఐఎల్‌ఆర్ పాయింట్‌ను రమణ తనిఖీ చేశారు. వైద్యులు అవినాష్, నవ్యకాంత్, తబస్సుమ్‌తో పాటు ఉద్యోగులు నర్సింహారావు, ప్రమీలారాణి, సత్యనారాయణ, హైమావతి, రజిని, భారతి, సునీత, అనూష, నీరజ, రామకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

కారులో వారు వద్దు!

పాలేరు సీటు విషయంపై అధిష్టానానికి ఫిర్యాదు

- కమ్యూనిస్టులను ప్రోత్సహిస్తున్నారని ప్రస్తావన
- వైరాలో ఇతర నేతల పెత్తనంపై గుర్రు
- మహబూబాబాద్‌లో ఇల్లెందు నేతల భేటీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ వివిధ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నేతల నడుమ ఉన్న పొరపొచ్చాలు తారాస్థాయికి చేరుతున్నాయి. సిట్టింగ్‌కే సీటు ఇవ్వాలని, కమ్యూనిస్టులను ప్రోత్సహించొద్దని ఓ నియోజకవర్గ నేతలు.. తమ పెత్తనం కొనసాగడం లేదని ఇంకో నియోజకవర్గంలో.. మరో చోట తాము ప్రతిపాదించే వారికే టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. అంతేకాక పక్క జిల్లాలకు వెళ్లి అంతరంగిక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని పాలేరు, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల్లో కొద్దిరోజులుగా జరుగుతున్న ఈ పరిణామాలపై విస్తృతంగా చర్చ సాగుతోంది. అయితే, అధిష్టానం పెద్దలు మాత్రం అందరి ఫిర్యాదులను సావధానంగా విని సముదాయించి పంపుతున్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఎన్నికల తరుణాన బీఆర్‌ఎస్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

పాలేరు సీటుపై రచ్చ..

ఉమ్మడి జిల్లాలో ఆది నుంచి పాలేరు సీటుపై రచ్చ కొనసాగుతోంది. బీఆర్‌ఎస్‌తో సీపీఎం, సీపీఐకి పొత్తు కుదిరితే సీపీఎం ప్రాధాన్యతగా పాలేరును కోరుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కానీ ఇప్పటివరకు పొత్తుపై ప్రకటన వెలువడలేదు. అయితే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ వచ్చే ఎన్నికల్లో తప్పక బరిలో నిలుస్తామని ప్రకటించారు. మరోపక్క బీఆర్‌ఎస్ నేతలు పాలేరు నుంచి మళ్లీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డే పోటీ చేస్తారని వెల్లడించారు. వారం క్రితం ఎమ్మెల్యే కందాల అనుచరులు నియోజవర్గ రాజకీయ పరిస్థితులను విన్నవించేందుకు సీఎంను కలవడానికి వెళ్లగా అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డిని కలిసినట్లు సమాచారం. కొందరు పార్టీ నేతలు కమ్యూనిస్టులను ప్రోత్సహిస్తున్నారని చెప్పినట్లు తెలిసింది. అయితే, నాయకులు మాత్రం ధాన్యం కొనుగోలు విషయమై పల్లాను కలిసినట్లు చెబుతున్నా, కందాలకు టికెట్, కమ్యూనిస్టుల దూకుడు పైనే చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది.



పెత్తనంపై వైరాలో వార్

వైరా నియోజవకర్గంలోని ఆత్మీ య సమ్మేళనాల్లో నేతల అలకలు వారి మధ్య అంతరాన్ని పెంచుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగుల బదిలీల్లో తమ ప్రతిపాదనలను తొక్కిపెట్టి ఇతర నేతలు పెత్తనం చెలాయిస్తున్నారని పార్టీ నేతలు అధిష్టానం ముందు వాపోయినట్లు సమాచారం. ఎక్కడా తమకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా ఇతర నేతలు నియోజకవర్గ రాజకీయాల్లో తలదూర్చుతున్నట్లు చెప్పారని ప్రచారం జరుగుతోంది. మరోపక్క పార్టీపరమైన కార్యక్రమాలన్నీ మూడు గ్రూపులుగా నిర్వహిస్తున్నారు. గ్రూప్ రాజకీయాలు చేస్తున్న వారిని గాడిలో పెట్టకపోవడం, పార్టీ సమావేశాలకు వారిని ఆహ్వానించకపోవడం వంటి పరిణామాలతో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ మూడు ముక్కలాటలా మారిందని కేడర్‌లో చర్చ జరుగుతోంది.

మహబూబాబాద్‌లో ఇల్లెందు రాజకీయం..

ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ రాజకీయం ఇటీవల మహ బూబాబాద్ కేంద్రంగా వేడెక్కింది. కొందరు నేతలు మహబుబాబాద్‌లో సమావేశమై ఎమ్మెల్యే హరిప్రియపై అసమ్మతి జెండా ఎగురవేసినట్లు తెలిసింది. అలాగే, ఎంపీ కవితకు నియోజకవర్గంలోని పరిణామాలను వివరించి ఇకనుంచైనా దృష్టి సారించి పార్టీ కోసం పనిచేసే వారిని కాపాడుకోవాలని కోరినట్లు సమాచారం. అలాగే మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు అసమ్మతి నేతలు సమాయత్తమవుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాస రాజకీయం జోరుగా సాగినా ఆ తర్వాత చల్లారింది. ఇంతలోనే ఎమ్మెల్యేపై ఓ వర్గం తిరుగుబావుటా ఎగురవేసి మహబూబాబాద్‌లో భేటీ కావడం చర్చనీయాంశమైంది.

ధాన్యం తరలింపు చకచకా

- ప్రభుత్వ శాఖల గోదాంల్లో నిల్వపై దృష్టి
- ప్రతిపాదనలు పంపించిన అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా రైతులు యాసంగిలో సాగు చేసిన వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది. మిల్లుల నుంచి సీఎంఆర్ తీసుకోవడంలో ఎఫ్‌సీఐ అధికారులు ఆలస్యం చేస్తున్నారని చెబుతుండగా, ఫలితంగా మిల్లుల్లో స్థలం లేక కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సేకరించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఇంతలోనే అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తుండడంతో ప్రభుత్వ సూచనలతో జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు.

మిల్లుల్లో సామర్థ్యం లేక..

ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన కొనుగోలు చేస్తుండగా నిల్వ చేసేందుకు మిల్లుల్లో స్థలం కొరత ఏర్పడుతోంది. జిల్లాలో ఈ యాసంగిలో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు 234 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలోని 58మిల్లుల్లో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి చేసుకునేందుకు మాత్రమే అవకాశముంది. ఇతర జిల్లాలకు తరలించాలని భావించినా అక్కడా స్థల కొరత ఉండడంతో ప్రభుత్వం జిల్లాలోని గోడౌన్లలోనే ధాన్యం భద్రపర్చడంపై దృష్టి సారించాలని సూచించింది.

17 గోదాంల గుర్తింపు

ప్రభుత్వ సూచనలతో అధికారులు జిల్లాలో వివిధ శాఖల పరిధిలోని 17 గోదాంలను గుర్తించారు. ఇందులో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఒకటి, మధిర మార్కెట్‌లో ఐదు, నేలకొండపల్లిలో ఏడింటితో పాటు ఖమ్మం ఎస్‌డబ్ల్యూసీ, మధిర, సూర్యాపేట జిల్లా కోదాడ, దొరకుంట వద్ద ఒక్కో గోడౌన్ కలిపి మొత్తంగా 17గోదాంల్లో 61,893 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు అవకాశమున్నట్లు తేల్చారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించగా త్వరలోనే అనుమతి వస్తుందని చెబుతున్నారు. అనుమతి వచ్చాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపు వేగంగా జరగనుంది.

గోదాంలు, మిల్లుల్లో తనిఖీ



గోదాంలో తనిఖీ చేస్తున్న బృందం

జిల్లాలోని స్టేట్ వేర్ హౌజ్ గోడౌన్‌తో పాటు పలు మిల్లులను కేంద్రప్రభుత్వ పరిధిలోని స్క్వాడ్ బృందం బుధవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సామర్థ్యం, నిల్వలపై ఆరాతీశాక రికార్డులను పరిశీలించారు. బృందం వెంట జిల్లా పౌర సంస్థ అధికారులు సోములు, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలోని మిల్లర్ల వద్ద లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యమే దిగుమతికి అవకాశం ఉంది. ఈక్రమంలో రైతులకు ఇబ్బంది రావొద్దనే ఇతర గోదాంల్లో నిల్వ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో 61వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాంలను గుర్తించి ప్రతిపాదనలు పంపించాం.

– ఎన్.మధుసూదన్, అదనపు కలెక్టర్

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మధిరలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

ఖమ్మం సహకారనగర్/మధిర: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిన అవసరముందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరం, మధిరలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఏర్పాటుచేసిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నాక ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఏళ్లుగా పదోన్నతులు, బదిలీలు లేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేలాదిగా సబ్జెక్ట్ టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపై భారం పడుతోందని తెలిపారు. ఇకనైనా కేజీబీవీ, ఎమ్మార్సీల్లో ఉద్యోగులు, సీఆర్పీలను రెగ్యులర్ చేయాలని, మన ఊరు - మన బడి పనుల్లో వేగం పెంచాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, పండిట్లు, పీఈటీల కోర్టు కేసులను పరిష్కరించి పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు. ఇదే సమయాన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. ఈ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చావా దుర్గాభవాని, మహబూబ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఎంపీపీ లలిత, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈఓ వై.ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, వినోద్, మురళి, విజయ్, మంగ్యా నాయక్, మల్సూర్, రామకృష్ణ, బస్సీలాల్, అంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈఈగా బాధ్యతలు స్వీకరించిన బాబురావు



ఖమ్మంఅర్బన్: జలవనరుల వైరా డివిజన్ ఈఈగా ములుగు నుండి బదిలీపై వచ్చిన కొంగర బాబురావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వైరా ఈఈగా ఉన్న శ్రీనివాస చార్యులను భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు బదిలీ చేయగా, ఈ స్థానంలో బాబురావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఇంజనీర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, బాబురావు గతంలో జిల్లాలోని ఎన్నెస్పీ, సీతారామ ప్రాజెక్టు పరిధిలో విధులు నిర్వర్తించారు.

హెచ్‌పీఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: బేగంపేట, రామంత్‌పూర్‌ల్లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్ల(హెచ్‌పీఎస్)లో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ బుధవారం ఖమ్మంలోని గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలో 23 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఆరుగురిని లాటరీ విధానంలో ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు ఎస్టీ డీడీ కృష్ణ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఈ రాములు, ఏటీడీఓ నర్సింగ్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యమే తీసుకుంటాం..

- నిర్ణయించిన జిల్లా రైస్ మిల్లర్లు

ఖమ్మం సహకారనగర్: రబీలో వరి సాగు చేసిన రైతుల నుంచి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈనేపథ్యాన జిల్లాలోని మిల్లర్లు ఖమ్మంలో బుధవారం సమావేశమై నాణ్యమైన ధాన్యం మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం నుంచి 68 శాతం బియ్యం(సీఎంఆర్) ఇవ్వాల్సి ఉన్నప్పటికీ నాణ్యత లేని కారణంగా నూక అధిక వస్తోందని చెప్పారు. తద్వారా మిల్లర్లు నష్టం భరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈమేరకు నాణ్యమైన ధాన్యమే తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు ప్రసాద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం 1, 2 సబ్ డివిజన్ల పరిధిలోని ఉద్యోగులు, సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఏ.సురేందర్ మాట్లాడుతూ అనుమతి లేని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు మార్చటం, సర్వీసు వైర్లు, వీధి దీపాలు సరిచేయకుండా చేస్తే ప్రమాదాలను తగ్గించొచ్చని తెలిపారు. ఆతర్వాత ప్రమాదాలు సంభవించినప్పుడు సీపీఆర్ చేసే విధానంపై వైద్యులు అవగాహన కల్పించారు. డీఈలు బీసీహెచ్.బాబూరావు, నంబూరి రామారావు, సీహెచ్.నాగేశ్వరరావు, ఏడీఈలు వై.రమేష్, సీహెచ్.చక్రవర్తి పాల్గొన్నారు.

హద్దుల ఏర్పాటును అడ్డుకున్న రైతులు



కాంట్రాక్టు సంస్థ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

రఘునాథపాలెం: నాగపూర్–అమరావతి జాతీయ రహదారికి సంబంధించి రఘునాథపాలెంలోని కోయచలక, కామంచికల్ గ్రామాల్లో హద్దులు నిర్ధారించేందుకు కాంట్రాక్టు ఏజెన్సీ సిబ్బంది యత్నించగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఏజెన్సీ బాధ్యులు బుధవారం వాహనాల్లో చేరుకుని హద్దులు నిర్ధారిస్తూ రాళ్లు పాతారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు వారిని అడ్డుకుని నిరసన తెలిపారు. భూములు ఇస్తున్నట్లు తాము అంగీకారం చెప్పలేదని, అధికారికంగా భూసేకరణ కూడా జరగకపోగా తమ పంట పొలాల్లో హద్దు రాళ్లు ఎలా పాతుతారని ప్రశ్నించారు. ఈక్రమంలో కొందరు రైతులు వాహనాలను అడ్డుకోవడమే కాక ధ్వంసం చేశారు. అలాగే, కూలీలను నిర్బంధించగా, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు ఫోన్‌లో మాట్లాడారు. ఇక నుంచి రైతుల అనుమతి లేకుండా రాబోమని చెప్పడంతో వారు శాంతించారు.

పంచాయితీకి పిలిచి దాడి

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెంలో పెద్దమనుషుల సమక్షాన మాట్లాడుకుందామని పిలిచి దాడికి పాల్పడ్డారని అందిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన వ్యక్తి కుమార్తెను అదే గ్రామానికి చెందిన సుతారీ వి.శ్రీకాంత్ వేధిస్తున్నాడు. దీంతో మంగళవారం ఖమ్మం 14వ డివిజన్ కార్పొరేటర్ ఇంటి వద్ద మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. తీరా అక్కడకు వెళ్లాక శ్రీకాంత్‌తో పాటు ఆయన స్నేహితులు పంచాయతీకి పిలుస్తావా అంటూ బాధితుడిపై దాడి చేయగా పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

పర్యాటక ప్రాంతంగా జాఫర్ బావి

- ఖిల్లా ప్రాంత రక్షణకు చర్యలు చేపట్టాలి
- పునరుద్ధరణ పనులను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



జాఫర్ బావిలో బయటపడిన ఖడ్గంను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్



ఆర్వోబీ మరమ్మతులపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఖిల్లాలో జాఫర్ బావిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. జాఫర్ బావి పూడికతీత, ఇతర పనులను బుధవారం ఆయన పరిశీలించి ఖిల్లా, జాఫర్ బావి చరిత్ర అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పూడికతీత తర్వాత బావి, పరిసరాలను సుందరీకరించాలని, పిచ్చి చెట్లు, పొదలు తొలగించి లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చడమే కాక, గెజిట్, రికార్డుల ప్రకారం సర్వే చేసి ఖిల్లా ప్రాంత రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అధికారులతో సమావేశమై జాఫర్ బావి ఆధునికీకరణ పనులపై సమీక్షించారు.

రాజుల నాటి ఖడ్గం?

ఖమ్మం ఖిల్లాలో వెయ్యేళ్ల క్రితం జాఫర్‌వుద్దీన్ రాజులు నిర్మించిన బావిలో వ్యర్థాలు తొలగిస్తుండగా మంగళవారం ఖడ్గం బయటపడింది. దీనిని రాజుల కాలం నాటిదిగా భావిస్తున్నారు. ఈ ఖడ్గాన్ని కలెక్టర్ తదితరులు పరిశీలించగా.. కేఎంసీ అధికారులు స్వాధీనం చేసుకుని భద్రపరిచారు.

ఆర్ఓబీ మరమ్మతు పనులు పరిశీలన

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: స్థానిక మయూరి సెంటర్‌లోని ఆర్ఓబీ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులకు సూచనలు చేశారు. మెయిన్ బీమ్‌లు, క్రాస్ బీమ్‌ల మరమ్మతు, స్లాబ్ క్రింది భాగంలో పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈకార్యక్రమాల్లో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఆర్డీవో రవీంద్రనాథ్, పురావస్తు శాఖ సహాయ సంచాలకులు నర్సింగ్‌నాయక్, మంగూనాయక్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ ఈఈలు శ్యాంప్రసాద్, కృష్ణలాల్, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, కేఎంసీ డీఈ నవ్యజ్యోతి, తహసీల్దార్ శైలజ, ఏఈఈ విశ్వనాథం, రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఆర్గనైజేషన్ ఫౌండర్ కల్పన రమేష్ పాల్గొన్నారు.

రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



వైరా రూరల్: గరికపాడులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి, నాయకులు

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరారూరల్: యాసంగిలో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో విఫలమైందని.. ఇకనైనా స్పందించకపోతే రెండు రోజులు వేచిచూసి ఉమ్మడి జిల్లా రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వైరా మండలం సిరిపురం, లింగన్నపాలెం, విప్పలమడక, గరికపాడు గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన అకాలవర్షాలతో తడిచిన ధాన్యంను పరిశీలించి మాట్లాడారు. ఇటీవల సీఎం కేసీఆర్ బోనకల్ మండలంలో పర్యటన సందర్భంగా ఎకరానికి రూ.10 వేల పరిహారం చెల్లిస్తానని హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదని ఆరోపించారు. ఇక ఇప్పుడు ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యం కాంటాలు, మిల్లులకు తరలింపులో ఆలస్యం జరగడంతో అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోయారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతల ధాన్యాన్ని ముందుగా కాంటా వేయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని పొంగులేటి ఆరోపించారు.

జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు

కొణిజర్ల/రఘునాథపాలెం: వచ్చే ఎన్నికల్లో తాను ఉండే పార్టీయే అధికారంలోకి వస్తుందని, అప్పుడు ప్రజాసమస్యలను దగ్గరుండి పరిష్కారం చేయిస్తానని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కొణిజర్ల, రఘునాథపాలెంల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న దీక్షా శిబిరాలను సందర్శించిన ఆయన వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. నాలుగేళ్లు జేపీఎస్‌లతో వెట్టిచాకిరీ చేయించుకున్న ప్రభుత్వం రెగ్యులర్ చేయకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎంపీపీ గోసు మధు, నాయకులు బానోతు విజయబాయి, దార్ల రాజశేఖర్, షేక్. రహీం, ఫణితి సైదులు, రాయల పుల్లయ్య, పరికపల్లి శ్రీనివాసరావు, గుండ్ల కోటేశ్వరరావు, చల్లగుండ్ల సురేష్, సవళ్ల ముత్తయ్య, గడల నరేంద్రనాయుడుతో పాటు జేపీఎస్‌లు రవీందర్ లాల్, రవి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం : జేపీఎస్‌ల దీక్షాశిబిరంలో పొంగులేటి

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్, సీపీ

ఖమ్మంలీగల్: ఇటీవల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన బీ.ఎస్.జగ్జీవన్ కుమార్‌ను బుధవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు భవన సముదాయంలో జడ్జిని కలిసిన వారు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా తదితరులు కూడా జడ్జిని కలిశారు.



జిల్లా జడ్జి పూలమొక్కలు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్

గోమాతకు సీమంతం

మండలంలోని నేరడకు చెందిన మట్టా రవి తన ఇంట్లో ఉన్న గోమాతకు బుధవారం సీమంతం జరిపించారు. గోమాతకు 9వ నెల రావడంతో ముత్తైదువులను పిలిచి సీమంతం ఘనంగా చేశారు. – చింతకాని



రాజ్యాంగ పరిరక్షణలో యువతే కీలకం

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీవుల్లా ఖాద్రీ



జెండా ఆవిష్కరించిన వలీవుల్లా ఖాద్రీ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నేటి యువత జాతీయ సమగ్రతకు పాటుపడుతూనే రాజ్యాంగ పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీవుల్లా ఖాద్రీ సూచించారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆధ్వర్యాన సంఘం ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించిన వలీవుల్లా ఖాద్రీ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కాగా, పాలకులు స్వప్రయోజనాల కోసం యువతను చెడు మార్గంలో పయనించేలా చేస్తున్నారని ఆరోపించారు. ఈ తరుణంలోనే ఏఐవైఎఫ్ పౌరులందరికీ సమాన విద్య, వైద్యం అందించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే నినాదంతో ఉద్యమిస్తోందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం హెచ్చుమీరగా, కాషాయ భావజాలాన్ని ప్రజలపై రుద్దడానికి యత్నిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు షేక్ జానీమియా, సిద్దినేని కర్ణకుమార్, ఇటికాల రామకృష్ణ, ఎం.డీ.గౌస్ పాషా, కటుకూరి సతీష్‌రెడ్డి, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఎం.శ్రావణ్, గణపారపు ఉపేందర్, ఎం.యుగేందర్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల ప్రయోజనాల కోసమే కాంటాలు జాప్యం

నేలకొండపల్లి: మిల్లర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు జాప్యం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని బౌద్ధ క్షేత్రం వద్ద ఇటీవల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని బుధవారం వారు పరిశీలించాక రైతులతో కలిసి ఖమ్మం–కోదాడ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈమేరకు తహసీల్దార్, ఎస్సై చేరుకుని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు మిల్లర్లు కుట్ర పన్నగా, వారికి పాలకులు, అధికారులు సహకరిస్తున్నారని విమర్శించారు. మెక్కుబడిగా కేంద్రాలను ఏర్పాటుచేసినా కాంటాలు, తరలింపులతో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి నాగరాజు, చిట్టా సైదిరెడ్డి, వున్నం వెంకటేశ్వర్లు, గండు జానయ్య, మాగం సైదులు, యడవల్లి నాగరాజు, యాతాకుల శ్రీనాథ్, పగిడిమర్రి అజయ్, వంగూరి బాలాజీ, కందుల గురునాథం, చిన్నానాయక్, ధనవత్ హరి, సంతోష్, కొలికపొంగు శశి, గట్టిగుండ్ల విజయ్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న నాయకులతో మాట్లాడుతునఎస్సై స్రవంతి

మిస్టరీ వీడిన మహిళ మృతి కేసు

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు నిర్ధారణ?
- నేడు వివరాలు వెల్లడించనున్న పోలీసులు

ఖమ్మంక్రైం: సంచలనం సృష్టించిన గిరిజన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం రామన్న గుట్ట తండాకు చెందిన ఓ మహిళ(45) గత నెల 27న తన అత్తమ్మను ఖమ్మంలోని ఆస్పత్రిలో చూపించేందుకు వచ్చింది. ఆస్పత్రిలో పరీక్షలు పూర్తయ్యాక ఆటోలో వెళ్తుండగా అత్త మూత్రవిసర్జన కోసం కిందకు దిగగా.. సదరు మహిళను ఆటోడ్రైవర్ తీసుకెళ్లి అత్యాచారం చేయడంతో అపస్మారకస్థితికి చేరుకుందని, ఆపై ఆస్పత్రిలో వదిలేశాడని ప్రచారం జరిగింది. ఈ ఘటన మంగళవారం వెలుగు చూడగా ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని మహిళ బంధువులు ఆరోపించారు. దీంతో పోలీసులు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. కానీ మహిళను ఆస్పత్రిలో వదిలి వెళ్లిన సమయానికి సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, ఆమె అత్తకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో పోలీసులకు చిక్కులు ఎదురయ్యాయి. చివరకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు సదరు మహిళ రోడ్డు ప్రమాదంలోనే తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

రోడ్డు దాటుతుండగా...

ఆస్పత్రిలో సదరు మహిళ తన అత్తను చూపించాక ఇద్దరూ కలిసి ప్రధాన రహదారిపైకి చేరుకున్నారని తెలిసింది. ఈక్రమంలో వైరా రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్ వద్ద మహిళను ద్విచక్రవాహనదారుడు బలంగా ఢీకొట్టడంతో ఎగిరి పడినట్లు సమాచారం. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడం, ఆమె అత్తమ్మ మానసిక స్థితి బాగా లేనందున ఓ ఆటోడ్రైవర్ సదరు మహిళ వెంట ఎవరూ లేరనకుని జనరల్ ఆస్పత్రిలో వెళ్లినట్లు తెలిసింది. ఆతర్వాత ఎలాగోలా ఆమె అత్త స్వగ్రామానికి చేరుకున్నా వివరాలు సరిగ్గా చెప్పలేకపోవడం, ఆటోలో తీసుకెళ్లినట్లు మాత్రం చూచాయగా చెప్పడం, మూడు రోజులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబీకులు కిడ్నాప్, ఆపై అత్యాచారం జరిగినట్లు భావించినట్లు సమాచారం.

అన్ని కోణాల్లో విచారణ

గిరిజన మహిళ కిడ్నాప్, ఆపై అత్యాచారం జరిగినట్లు ప్రచారం జరగడంతో పోలీసులు కేసును ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆమె ఫొటో ఆధారంగా జిల్లా కేంద్రంలోని అన్ని ఆటో అడ్డాలో విచారించారు. అలాగే, గిరిజన మహిళకు స్వగ్రామంలో ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా, భర్తతో సఖ్యత ఎలా ఉందో ఆరా తీశారు. అదేరోజు ఆమె బంధువులు ఎవరైనా ఖమ్మం వచ్చారా అని కూడా విచారణ చేపట్టారు. చోరీ కోణంలో విచారణ చేపట్టగా, మహిళ ఒంటిపై అంతంత మాత్రంగానే బంగారం ఉండడంతో దొంగలు పని కాదని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. చివరకు వివిధ షాపుల్లో సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా విచారించి రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సదరు మహిళ మృతి చెందినట్లు తేల్చిన పోలీసులు... గురువారం వివరాలు వెల్లడించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

జిరాక్స్ షాపు దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు

ఎర్రుపాలెం: మండలంలోని రామన్నపాలెంలో కొత్తపల్లి ప్రకాశరావుకు చెందిన జిరాక్స్ షాపును దగ్ధం చేసిన అదే గ్రామానికి చెందిన బొబ్బిళ్లపాటి పుష్పరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.సురేష్ తెలిపారు. రామన్నపాలెంలోని పాఠశాల ఎదుట ప్రకాశరావు కొంతకాలంగా జిరాక్స్ సెంటర్ నడుపుతుండగా, పాతకక్షల కారణంగా గత నెల 28న రాత్రి పుష్పరాజ్ నిప్పంటించాడు. ఈ ఘటనలో ఫ్రిజ్‌లు, జిరాక్స్ మిషన్, కంప్యూటర్లు కాలిపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మూడంచెల్లో సీఎం కప్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యాన నిర్వహించనున్న సీఎం కప్ పోటీలను మూడంచెల్లో జరిపేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు పురుషులకు మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, పురుషులు, మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారు. ఆతర్వాత జిల్లా స్థాయిలో 22నుంచి 24వ తేదీ వరకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ పోటీలు జరుగుతాయి. ఇందులో బాక్సింగ్, ఫుట్‌బాల్ పోటీలు కేవలం పురుషులకే నిర్వహిస్తారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఈనెల 28నుంచి 31వ తేదీవరకు ఈ క్రీడాంశాలే కాక ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్‌ల్లోనూ పోటీలు జరుగుతాయి. ఇందుకోసం మండల స్థాయి, జిల్లా స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కమిటీలు ఏర్పాటుచేస్తారు. కాగా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలిచే వారికి శాట్స్ భారీ మొత్తంలో నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం..

- అంతర్జాతీయ సెయిలింగ్ క్రీడాకారుడు అఖిల్
- తాజాగా నార్త్ ఈస్ట్ టోర్నీలో స్వర్ణ పతకం



అలేఖ్యతో కలిసి బహుమతి స్వీకరిస్తున్న అఖిల్

ఖమ్మం స్పోర్ట్స్: భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించి పతకం సాధించడమే తన లక్ష్యమని అంతర్జాతీయ సెయిలింగ్ క్రీడాకారుడు పిల్లి అఖిల్ వెల్లడించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ టోర్నీల్లో దాదాపు 15 పతకాలు సాధించిన ఆయన వచ్చేనెల 22నుంచి 27 వరకు టోక్యోలో జరగనున్న ఒలింపిక్ వీక్‌కు సిద్ధమవుతున్నాడు. జిల్లాలోని వైరా మండలం కోప్పాల గ్రామానికి చెందిన పోలీసు శాఖ ఉద్యోగి రాజు కుమారుడైన అఖిల్ ప్రస్తుతం బెంగూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ అంతర్జాతీయ టోర్నీలే ప్రామాణికంగా లక్ష్యసాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ కోచ్‌లు మురుగన్, అర్జున్ దగ్గర శిక్షణ పొందుతున్నానని, పూర్తిస్థాయిలో సాధన చేసి ఒలింపిక్స్‌లో పతకం తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు.

డబుల్ స్కల్‌లో స్వర్ణ పతకం

మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో గతనెల 28నుంచి ఈనెల 2వ తేదీవరకు నార్త్ ఈస్ట్ 420 సెయిలింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో డబుల్ స్కల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన అలేఖ్య కాండుతో కలిసి పాల్గొన్న అఖిల్ స్వర్ణ పతకంతో పాటు రూ.లక్ష నగదు పారితోషికం అందుకున్నాడు. అయితే, తనకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తే మరిన్ని విజయాలు సాధించగలమనని అఖిల్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

మహిళ మెడలో గొలుసు చోరీ

బోనకల్: వాహనంపై తీసుకెళ్తానని నమ్మించి మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. మండలంలోని సింగరాయపాలెంకు చెందిన చెల్లగుండ్ల రేణుక బస్సులో బుధవారం తల్లిగారిల్లయిన రావపల్లికి బయలుదేరింది. రావపల్లి అడ్డరోడ్డులో బస్సు దిగాక రెండు కి.మీ. వెళ్లాల్సి ఉండగా, అక్కడ ఉన్న గుర్తుతెలియని యువకుడు ద్విచక్రవానంపై తీసుకెళ్తానని నమ్మించాడు. దీంతో ఆమె వాహనం ఎక్కగా కొద్దిదూరం వెళ్లాక పెట్రోల్ అయిపోయిందని బండి ఆపి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. దీంతో రేణుక కేకలు వేయడంతో సమీప ఎస్సీ కాలనీవాసులు చేరుకుని సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై కవిత తెలిపారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణకు పాలకుల కుట్ర



ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

సత్తుపల్లి: కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న మోదీ, కేసీఆర్‌లు బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర పన్నారని ఐఎన్‌టీయూసీ ఆలిండియా సెక్రటరీ జనక్‌ప్రసాద్ ఆరోపించారు. సత్తుపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మాటలు చెబుతున్న కేసీఆర్, బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఎంఎండీఆర్ చట్టానికి ఎలా మద్దతు ఇచ్చారని ప్రశ్నించారు. మోదీతో ఉన్న అంతర్గత ఒప్పందాలతోనే ఇలా చేశారని ఆరోపించారు. కార్మికుల శ్రమతో గద్దెనెక్కిన కేసీఆర్ ఎనిమిదేళ్లుగా మోదీతో అంటకాగుతూ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త గనులు, ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేకపోగా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. అనంతరం జనక్ ప్రసాద్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు సత్కరించారు. ముందుగా జేవీ ఆర్ ఓసీలో ఐఎన్‌టీయూసీ పతాకాన్ని ఆవిష్కరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శంకర్ నాయక్, సి.త్యాగరాజన్, ఆల్బర్ట్, నాగభూషణం, ఎస్.రామారావు, ఐ.కృష్ణ, ప్రసన్నకుమార్, భిక్షపతి, రమణయ్య, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఫజల్ బాబా, రాజేశ్వరరావు పాల్గొన్నారు.